

విజయకుమార్‌కు నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి తదితరులు

విజయకుమార్‌కు ప్రముఖుల నివాళి

చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గానసభ ఆడిటోరియం లోపల దివంగత సాహిత్య, సాంస్కృతిక, సంగీత, నృత్య, రాజకీయ ప్రముఖుల దేశ నాయకుల నిలువెత్తు తైల వర్ణచిత్రాలు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి విజయకుమార్ నిస్వార్థ దానగుణం కలిగిన వ్యక్తి అని ప్రముఖ సాహితీవేత్తలు, గాయకులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన విజయకుమార్‌కు సంతాపం ప్రకటిస్తూ త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆదివారం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో పలువురు పాల్గొని వారు విజయకుమార్‌తో తమకున్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ గానసభ సందర్శకులకు ఆనందం, విజ్ఞానం కలిగించటమే తన సంతోషంగా భావించారు అని చెప్పారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ విజయకుమార్ కళా హృదయుడు, సంగీతప్రియుడు అని వివరించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత కిన్నెర రఘురామ్ మాట్లాడుతూ దాన గుణ సంపన్నుడు విజయ కుమార్ అని ప్రశంసించారు. గాయకులు వైఎస్‌రామకృష్ణ, త్రినాథరావు, వసుంధర, నటులు రోశిరెడ్డి, జంగయ్యగౌడ్, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు లోకం కృష్ణయ్య, ఓంకార్‌రాజు, వంశీకృష్ణ, కిరణ్, గానసభ పాలక మండలి సభ్యులు బండి శ్రీనివాస్ విజయకుమార్‌కు నివాళులర్పించారు.



ఎల్‌ఐసీ కాలనీలో కార్పొరేటర్ రచనశ్రీకి సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ ఎల్‌ఐసీ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులకు స్థానిక కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. కవాడిగూడ డివిజన్ ఎల్‌ఐసీ కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు కార్పొరేటర్ జి రచనశ్రీ ఎల్‌ఐసీ కాలనీలో ఆదివారం పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీకాలనీ నూతన అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి రాకేష్, రాఘవ, విశాల్, కల్యాణ్‌గౌడ్, వేణు తదితరులు మాట్లాడుతూ.. ఎల్‌ఐసీ కాలనీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరింగ్ పని చేయడం చేయడం లేదని, కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పర్యవేక్షణ లేకపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయిందని వివరించారు. కార్పొరేటర్ రచనశ్రీ మట్లాడుతూ.. ఎల్‌ఐసీ కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మాలల సింహగర్జన విజయవంతం

నల్లకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మగౌరవం, ఐక్యత కోసం చాటిన మాలల సింహగర్జన విజయవంతమైందని జాతీయ మాలల జేఏసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది ఎన్.ఇ.మహేందర్ అన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది మాలలున్నారని పేర్కొన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ సత్యానగర్ బస్తీ నుంచి పెద్దఎత్తున మాలల మహిళలు, యువకులు, నాయకులు వాహనాలు, బైక్‌లలో పెద్దఎత్తున పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జనకు తరలివెళ్లారు. కార్యక్రమంలో సత్యానగర్ బస్తీవాసులు బి.రాంచందర్, కుర్మ భిక్షపతి, డి.అశోక్‌కుమార్, జానకి, రాజేశ్వర్‌రావు, జగదీష్, రాజేందర్, శ్రీనివాస్, రవి రాజ్, క్రాంతి, జి.వెంకటేష్, బి.ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించాలి

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఇంటర్, డిగ్రీ, పీజీ ఇతర వృత్తి విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కలుషిత ఆహారంతో మృతి చెందిన విద్యార్థుల సమస్యలపై త్వరలోనే విశ్రాంత న్యాయమూర్తులు, జడ్జిలు, మాజీ ఐఏఎస్ అధికారులతో కలిసి నిజనిర్ధారణ బృందంగా అన్ని ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. కలుషిత ఆహారం తిని విద్యార్థులు మృతి చెందిన ఘటనలపై బీఆర్ఎస్ 48 మంది చనిపోయారని ధ్వజమెత్తారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కంచకర్ల శ్రీనివాస్, కిరణ్, అనిల్ పాల్గొన్నారు.



బర్కత్‌పురలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎన్.గౌతమ్‌రావు తదితరులు

కాంగ్రెస్ పాలనలో కుంటుపడిన గ్రేటర్ అభివృద్ధి

బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ యేడాది పాలనలో గ్రేటర్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆరోపించారు. ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. గ్రేటర్ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవాలను నిరసిస్తూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బర్కత్‌పుర రాఘవేంద్రస్వామి బృందావన సమితి నుంచి నింబోలిఅడ్డ మహంకాళి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిరసన ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, నందకిషోర్‌యాదవ్; ఎక్కాల నందు, సి.కృష్ణగౌడ్, శ్యామ్‌రాజ్, క్షీర సాగర్, అరవింద్, యశ్వంత్, చుక్కా జగన్, ఎస్.ఎస్.రామ్ పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న జెరిపాటి జైపాల్ తదితరులు

వడ్డెరుల సమస్యలను పరిష్కరిస్తాం

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపాటి జైపాల్ హామీ ఇచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వడ్డె ఓబన్న తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఐకమత్యంతో వడ్డెరులందరూ ముందుకు సాగి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జాతీయ వడ్డెర సమాజ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ మౌర్యా మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆధునిక దేశ నిర్మాణంలో వడ్డెర కులం అత్యంత కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎత్తరి మారయ్య, సంపంగి ప్రభాకర్, నాయకుడు కొమ్ము రాజశేఖర్, రూప, వెంకటేష్, రాజు జగన్నాథ్, డి.సమ్మయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్కడ కార్యాలయం.. ఇక్కడ ప్రజలు

- అందుబాటులో లేని అంబర్‌పేట సర్కిల్ కార్యాలయం
- ఆబిడ్స్‌లో ఉంటే ప్రజలకు ప్రయోజనం ఎలా?
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నెహ్రూనగర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం

గోల్నాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ప్రజలు వేచి చూస్తున్నారు. సర్కిల్ కార్యాలయం నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో కాకుండా మరో నియోజకవర్గంలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా సమస్యలపై ఫిర్యాదు చేయడానికి సర్కిక్ కార్యాలయానికి వెళ్లలేని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. సర్కిల్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2009లో అసంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన జరిగినప్పుడు ప్రతీ నియోజకవర్గానికి ఒక సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. కానీ అంబర్‌పేట సర్కిల్ కార్యాలయం మాత్రం మరో సర్కిల్‌లో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అద్దె భవనంలో..

మొట్టమొదటగా సర్కిల్ కార్యాలయం బర్కత్‌పురలో అద్దెభవనంలో కొనసాగింది. నాటు హిమాయత్‌నగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు ఒకే కార్యాలయం. 1995లో అద్దెభవనం ఖాళీ చేసి రాణింగంజ్‌లోని బుద్ధా భవన్‌లో ఏర్పాటు చేశారు. ఇది రెండు నియోజకవర్గాల ప్రజలకు దూరంగా మారింది. దీంతో ప్రజల విజ్ఞప్తుల మేరకు అక్కడి నుంచి 1998లో ఆబిడ్స్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కింగ్ కాంప్లెక్స్‌లోకి సర్కిల్ కార్యాలయంను మార్చారు. అయినా రెండు నియోజకవర్గాల ప్రజలకు దూరభారంగానే ఉంది. 2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత నియోజకవర్గానికి ఒక సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే కార్యాలయాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశించారు. కానీ ఆబిడ్స్‌లోనే రెండు వేర్వేరు కార్యాలయాలుగా విభజించి అధికారులు పాలన కొనసాగించారు. ఇలా అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు 15 ఏళ్ల నుంచి ప్రజలు ఆబిడ్స్‌లోని సర్కిల్ కార్యాలయానికి వెళ్లక తప్పడం లేదు. గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలోనే సర్కిల్ ఆఫీస్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. కానీ అవి ఆచరణకు నోచుకోలేదు.

వినతులన్నీ బుట్టదాఖలు

సర్కిల్ కార్యాలయం ప్రజలకు అందుబాటులోకి తేవాలన సంబంధిత అధికారులకు ఎన్ని వినతులు ఇచ్చినా.. ఎంతమంది నాయకులకు మొర పెట్టుకున్నా.. సర్కిల్ కార్యాలయాన్ని ప్రజలకు చేరువ చేయలేకపోతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ప్రజలకు హామీ ఇవ్వడమే తప్పా ఆచరణకు నోచుకోవడం లేదని ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఎక్కువ శాతం ప్రజలకు సర్కిల్ కార్యాలయం ఎక్కడ ఉన్నదో కూడా తెలియని పరిస్థితి ఉంది.

పాలన పరంగా అధికార వికేంద్రీకరణ చేసి ప్రజాపాలన అందుబాటులోకి తేవాలన్న లక్ష్యం నేరవేరకుండా సర్కిల్ కార్యాలయాన్ని ఆబిడ్స్‌లోనే కొనసాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెహ్రూనగర్‌లో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు

- డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి

బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఇద్దరు బాలికలు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికయ్యారని హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి తెలిపారు. తెలంగాణ విద్యా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎడ్యుకేషన్ జోన్ పరిధిలోని హైదర్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో హైదర్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.ప్రేమావతి మొదటి బహుమతిని, సెయింట్ పీటర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.సాక్షి ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. ఈ ఇద్దరు బాలికలు త్వరలో బషీర్‌బాగ్‌లోని అలియా మోడల్ స్కూల్‌లో జరగనున్న హైదరాబాద్ జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఫీజు బకాయిల కోసం 10న కలెక్టరేట్ల ముట్టడి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 16 లక్షల 75 వేల మంది విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఈనెల 10న బీసీ సంక్షేమ సంఘం, బీసీ విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని, దీంతో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇంత వరకు ఫీజు బకాయిలను విడుదల చేయలేదని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు బకాయిల కోసం అనేక ఉద్యమాలు, ఆందోళనలు, నిరసనలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 వేల కోట్ల స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలన్నారు. ఈ నెల 10న జరిగే రాష్ట్రవ్యాప్త కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు సి.రాజేందర్, రాంకోటి, నందగోపాల్, రవికుమార్‌యాదవ్, ఉదయ్‌నేత, ఆశిష్‌గౌడ్ పాల్గొన్నారు.

మాలధారణతో భక్తి రెట్టింపు: ఎమ్మెల్యే



అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపాల్

కవాడిగూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి 41 రోజుల మాలధారణ ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అయ్యప్ప భక్తుల దీక్ష ఇటు ఆరోగ్యానికి, అటుభక్తి బావన పెంపొందించడానికి ఉపయోగంగా ఉంటుందని ఆయన అన్నారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పేరుస్వామి వల్లాల శ్యామ్ యాదవ్ అయ్యప్ప స్వాముల బృందం డివిజన్‌లోని భాగ్యలక్ష్మినగర్‌లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన సన్నిదానంలో గురుస్వామి ప్రత్యేక పూజలతో ఇరుముడి కట్టుకొని శబరిమలైకి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, బోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు స్వామి వై శ్రీనివాస్‌రావుల్గొన్నారు.

● పేదలకు దుప్పట్ల పంపిణీ



చలికాలంలో పుట్‌పాత్‌లపై నివసించే వారు రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డులకు చలి నుంచి తట్టుకునేందుకు సంఘ సేవకులు శనివారం రాత్రి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోషాల, పుట్‌పాత్‌లపై నివాసం ఉండే నిరుపేదలకు సంఘ సేవకులు సామల సత్తిరెడ్డి, వినయ్‌సింగ్, రమ్మి, లడ్డు, విశ్వం, కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి బండ జుగేందర్‌లు వారికి ఉచితంగా దుప్పట్లును పంపిణీ చేశారు. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి స్వచ్ఛంద సంస్థ ముందుకు రావాలని వారు సూచించారు.

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి



రుద్రపూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా సామూహిక రుద్రపూజ

చిక్కడపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం సామూహిక రుద్రదపూజను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివునికి అభిషేకం నిర్వహించారు. పండిట్ రవిశంకర్ ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు, వెల్ఫేర్ సెంటర్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. వెల్ఫేర్‌సెంటర్ ప్రధానకార్యదర్శి బి సూర్యప్రకాష్ పర్యవేక్షించారు. పద్మాసూర్యప్రకాష్, గోళ్ళమూడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలీ సంఘం వార్షిక వేడుకల్లో పాల్గొన్న నేతలు

పద్మశాలీ సంఘం కార్తీక వనభోజనాలు

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలీ సంఘం 12 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించిన కార్తీక మాస వనభోజనాలు, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్.రాములు, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామిలు హాజరయ్యారు. అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పుట్ట పాండురంగయ్య, కత్తుల సుదర్శన్‌రావు, డాక్టర్ మార్త రమేష్, ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వి.రాజశేఖర్, సమత, శారద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్ర పట్టభద్రులందరూ సోషల్ ఇంజనీర్లే

ఓయూ లా కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి



లా కాలేజీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ప్రొఫెసర్ జి.బి.రెడ్డి, పట్టభద్రులు

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): న్యాయ శాస్త్ర పట్టభద్రులందరూ సోషల్ ఇంజనియర్స్ అని ఓయూ లా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ జి.బి.రెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ సెరమనీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవృత్తి చాలా ఉన్నతమైనదన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన పట్టభద్రులకు అనంత రాజమ్మ మెమోరియల్ గోల్డ్‌మెడల్‌ను ఆయన బహూకరించారు. అనంత లా కాలేజీ కరస్పాండెంట్ రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.చంద్రమతి పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ముషీరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ముషీరాబాద్‌కు చెందిన ఎన్ కృష్ణారావు అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడంతో చెక్కును ఎమ్మెల్యే ముఠాగోపాల్ బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి.శ్రీధర్‌చారి, ముషీరాబాద్, గాంధీనగర్, కవాడిగూడ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, నియోజకవర్గం బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాత్ర ఎంతో గొప్పదని టీజీఎస్‌పీడీసీఎల్ మెట్రోజోన్ సీజీఎం చక్రపాణి పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముషీరాబాద్ ఏఈ బి.శాంతారావు పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సంస్థలో, ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సంస్థలో 36 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ చేసిన శాంతారావును సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బి.శాంతారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆజామాబాద్ డీఈ కమాల్‌కుమార్, ఏడీలు వినోద్‌కుమార్, శ్రీనివాస్, శీనయ్య, యూనియన్ నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్, జంజిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.




ఉత్తమ ఉపాధ్యాయులను, విద్యార్థులను సత్కరిస్తున్న కిషన్‌రెడ్డి

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంబర్‌పేట మండల్ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీలో టాపర్ విద్యార్థులకు అవార్డులతోపాటు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. టాలెంట్ ఎవరి సొత్తు కాదని విద్యార్థులు అంకితభావంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజశేఖర్‌రెడ్డి, రవి, నాయకులు రవికుమార్, నిరంజన్, శోభారెడ్డి, కార్పొరేటర్లు యాకర.అమృత, బి.పద్మావెంకటరెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టూవీలర్స్ మెకానిక్‌లకు ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేయించకుంటున్న జగన్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఆర్థోపెడిక్, న్యూరాలజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. 200ల మంది మెకానిక్‌లకు మందులు అందజేశారు. కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధిలు ఏ వాసు బాబు, జవార్, ముషీరాబాద్ నియోజకవర్గం టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు సీతాబాలకృష్ణ, జగదీష్, కోశాధికారి వెంకట్ బాలరాజు, ఉపాధ్యక్షుడు బల్లా ప్రశాంత్, ఎస్వీరెడ్డి, నాయకులు రాఘవరాజ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రైతు కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న కోదండరెడ్డి

పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను నిర్ణయించి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగాలం కష్టపడి శ్రమ చేస్తున్నారని వారి కష్టాన్ని గుర్తించి సాయం చేయాలన్నారు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలో మృతి చెందిన 12 మంది రైతు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున చెక్కులను జస్టిస్ చంద్రకుమార్‌తో కలిసి కోదండరెడ్డి అందజేశారు. మాజీ న్యాయమూర్తి, రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్, విశ్రాంత శాస్త్రవేత్త బాబురావు, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, న్యాయవాది లక్ష్మీనారాయణ, వెంకటేస్, సోగరాబేగం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ఇంటింటికీ ప్రచారం

రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

రాంనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాపాలన సంబరాల గురించి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ గౌరీ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతుల రుణమాఫీ, పేదల ఇంటింటికీ ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలు సంవత్సరంలోపే అమలు చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదేన్నారు. సంవత్సర కాలంలో 53 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనన్నారు. జీవో నెంబర్ 317 కాలంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తుండడంతో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బ్లాక్ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.